



జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబాబాద్
గురువారం 16-4-2026 పేజీలు : 8

### డి.హెచ్.పి.ఎస్ రాష్ట్ర మహాసభలకు
## వాల్ పోస్టర్ ఆవిష్కరణ

మరిపెడ,ఏప్రిల్15 (ప్రజాజ్యోతి)

దళిత హక్కుల పోరాట సమితి డి.హెచ్.పి.ఎస్ఆధ్వర్యంలో నిర్వహించబడనున్న తెలంగాణ రాష్ట్ర మహాసభల సందర్భంగా వాల్ పోస్టర్‌ను మరిపెడ పట్టణ కేంద్రంలో కార్గిల్ సెంటర్‌లో ఘనంగా ఆవిష్కరించారు. ఈ మహాసభలు ఈ నెల 17,18 తేదీలలో వరంగల్‌లోని పోచమ్మ మైదానం సమీపంలోని అబ్బాస్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్నాయి.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్, డి.హెచ్.పి.ఎస్ మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దళితులు ఇప్పటికీ అనేక సామాజిక,ఆర్థిక,రాజకీయ అన్యాయాలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.భూహక్కులు, విద్య, ఉపాధి, గృహ వసతి, భద్రత, గౌరవప్రదమైన ... మిగతా 3లో...

# గుప్త నిధుల కోసం గుట్ట తవ్వకాలు



**డోర్నకల్ ఏప్రిల్ 15 ప్రజాజ్యోతి:**
డోర్నకల్ మండలంసీతారామపురం గ్రామ పరిధిలో గుప్త నిధుల కోసం రహస్యంగా తవ్వకాలు జరిపిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చి గ్రామంలో ఆందోళనకు దారితీసింది. గ్రామ శివారులోని గుట్టపై అనుమానాస్పదంగా తవ్విన గుంతలు కనిపించడంతో స్థానికులు అప్రమత్తమయ్యారు.గ్రామస్తుల వివరాల ప్రకారం, కొంతమంది ముఠాగా ఏర్పడి రాత్రి వేళల్లో ఎవరూ గమనించకుండా గుట్టపై తవ్వకాలు నిర్వహించినట్టు అనుమానం వ్యక్తమవుతోంది. ఇటీవల అక్కడ గుంతలు, మట్టి చెదిరిన ఆనవాళ్లు కనిపించడంతో ఈ ఘటన బయటపడింది.తవ్వకాలు జరిగిన ప్రదేశంలో పసుపు, కుంకుమ చల్లిన ఆనవాళ్లు, పూజలకు ఉపయోగించే వస్తువులు, అలాగే తవ్వడానికి వినియోగించిన పనిముట్లు అక్కడే వదిలివేయడం గమనార్హం. ఈ నేపథ్యంలో క్షుద్రపూజలతో సంబంధం ఉండవచ్చని గ్రామస్తులు భావిస్తున్నారు. దీంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి.ఈ ఘటనపై గ్రామ ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, ఇటువంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు. గ్రామంలో భద్రతా చర్యలు పెంచాలని కూడా వారు డిమాండ్ చేస్తున్నారు.



## మంత్రి సీతక్కపై విష ప్రచారం చేస్తే ఖబడ్దార్!

మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ దిష్టిబొమ్మ దహనం

అధికారం కోల్పోయిన కసితోనే బీఆర్ఎస్ చిల్లర రాజకీయాలు

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వజ్జ సారయ్యడ రూరల్ డెవలప్మెంట్ రాష్ట్ర డైరెక్టర్ చల్ల నారాయణరెడ్డి ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీనివాస్

జిల్లా నాయకులు విజయ రూప్సింగ్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకరబోయిన మొగిలి యాదవ్

3 లో..

### అమ్మపాలెంలో గిరిజన భవనం
## అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా



**డోర్నకల్ ఏప్రిల్ 15 ప్రజా జ్యోతి:**
డోర్నకల్ మండలం అమ్మపాలెం గ్రామంలో గిరిజనుల సంక్షేమం కోసం నిర్మించాల్సిన గిరిజన భవనం ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురై అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారింది. గ్రామ అభివృద్ధికి ఉపయోగపడాల్సిన ఈ భవనం పేకాట, మద్యం సేవలు వంటి అనైతిక పనులకు వేదికగా మారడంతో స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. 2018లో సుమారు రూ.1.10 కోట్లతో ప్రారంభమైన ఈ నిర్మాణం మధ్యలోనే ఆగిపోవడంతో భవనం అసంపూర్తిగా మిగిలిపోయింది. అప్పటి నుంచి పనులు పునఃప్రారంభం కాకపోవడంతో భవనం పాడైపోతూ అసురక్షితంగా మారిందని గ్రామస్థులు చెబుతున్నారు.భవనం పరిసరాల్లో మద్యం సీసాలు, చెత్త పేరుకుపోవడం, అనుమానాస్పద వ్యక్తుల రాకపోకలు పెరగడం వల్ల గ్రామంలో భయాందోళన వాతావరణం నెలకొంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు రాత్రివేళ బయటకు రావడానికి భయపడుతున్న పరిస్థితి ఉంది. యువత చెడు మార్గంలో వెళ్లే ప్రమాదం ఉందని పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే నిర్మాణ పనులను పునఃప్రారంభించి భవనాన్ని పూర్తి చేయాలని, అప్పటి వరకు పోలీస్ పహారా ఏర్పాటు చేసి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

# రోడ్డు నియమాలపై అవగాహన ర్యాలీ



**కేసముద్రం,ఏప్రిల్ 15(ప్రజాజ్యోతి):** కేసముద్రం మండల కేంద్రంలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్ లో బుధవారం జిల్లాఎస్పీ ఆదేశాల మేరకు రోడ్డుభద్రతపై అవగాహన ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ,ప్రస్తుత కాలంలో రోడ్డు ప్రమాదాలు రోజురోజుకీ పెరుగుతున్నాయని, వాటిని నివారించడానికి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు.విద్యార్థులు చిన్న వయస్సు నుంచే రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని, భవిష్యత్తులో వారు బాధ్యతాయుత పౌరులుగా మారడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ వినియోగం, వేగ పరిమితులు పాటించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదని వంటి ముఖ్యమైన నియమాలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని సూచించారు.అలాగే, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపడం ప్రమాదకరమని, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవించడం ద్వారా అనేక ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. రోడ్డు మీద నడిచే వారు, వాహనదారులు ఇద్దరూ పరస్పరం జాగ్రత్తగా ఉండాలని, చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి..

### జల్లే జయరాజు సిఐటియు మండల కార్యదర్శి

**కేసముద్రం, ఏప్రిల్ 15(ప్రజాజ్యోతి):** బుధవారం రోజున కేసముద్రం మున్సిపాలిటీలోని అంబేద్కర్ సెంటర్లో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఆశ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు కొండేటి విజయ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇవ్వడం అయినది.ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి జల్లే జయరాజు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసంధానంగ విధులు నిర్వహిస్తున్న ఆశ వర్కర్లకు అరకొర



వేతనాలు ఇస్తూ శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనికి తగ్గ పేరుతోషకాలు కాకుండా ఆశ వర్కర్లకు ఫిక్స్ వేతనం నెలకు రూ.18 వేల రూపాయలు ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని, పెండింగ్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. ఈ కార్యక్రమంలో దయ్యాల పుష్ప,గద్దల కోమల, పుష్ప,అలువల దేవేంద్ర, సునీత,జ్యోతి, సీనమ్మ, నాగమణి, స్పందన, సువార్త,పద్మ, సుభద్ర, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# లంబాడీల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మహా భోగ్ కార్యక్రమం

**మరిపెడ,ఏప్రిల్15(ప్రజాజ్యోతి)** మాకుల జాతర సందర్భంగా లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర ముఖ్య సమన్వయ కర్త జాదవ్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో మహా భోగ్ భండార్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జాతి గురువులు,సప్త భవానీ మాతల చిత్రపటాలను ప్రదర్శించి,పూలదండలతో అలంకరించారు.భావసంగ్ మహారాజా మరియు మ్యారమా భవానీ క్షేత్ర మాకుల జాతర, మాజీదేవ్ జాతర మజీర్ హాట్ సందర్భంగా పట్టణ కేంద్రంలోని లంబాడీల ఐక్య వేదిక కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.జాతి సాధువులు, సంతులు,బావోజీలు,భగత్‌ల చేతుల మీదుగా మహాభోగ్ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ఐఆర్టీఎస్ రిటైర్డ్ అధికారి కస్నా నాయక్ ముఖ్య అతిథిగా హాజరై,జాతికి చెందిన ఆరు గురు గురువులు మరియు సప్త భవానీ మాతల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో లైవ్ అడ్వకేట్ విభాగ కార్యదర్శి



హరి నాయక్,బీజేపీ జిల్లా నాయకులు సుధాకర్ నాయక్,బావోజీ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి సీతారామ్ బానోతు,డోర్నకల్ నియోజకవర్గ ఇంచార్జ్ బానోతు ప్రవీణ్ నాయక్,జిల్లా అధ్యక్షులు రాజునాయక్ ఆంగోత్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు బాలు నాయక్ బోడ,వస్య నాయక్,రంజా హర్యావత్, బాసు నాయక్,నరేష్ నాయక్,మోహన్ నాయక్ గుగులోత్,దేవేందర్ నాయక్, భూక్యా గోపి నాయక్,రాజేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరించి.. ప్రాణాలను కాపాడుకోవాలి

**నర్సింహులపేట,ఏప్రిల్15(ప్రజా జ్యోతి):** ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని నర్సింహులపేట జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు,మండల విద్యాధికారి రామ్మోహన్ రావు అన్నారు.బుధవారం విద్యార్థులకు రోడ్ సేఫ్టీ అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించి చైతన్య పరచారు.అనంతరం ప్రతిజ్ఞ చేయించారు.అమ్మ జన్మనిస్తే హెల్మెట్ పునర్జనమనిస్తుంది అని తయారు చేసిన స్టిక్కర్లు వాహనాలకు అంటించారు. వాల్మెంట్ ధరించడం వల్ల ప్రమాదాల బారి నుంచి రక్షణ కలుగుతుందన్నారు.హెల్మెట్ ఏ విధంగా ఉపయోగపడుతుందో ఉపయోగాలను వాహనదారులకు వివరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు,ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్,సిఆర్పిలు శేషు కుమార్,తదితరులు ఉన్నారు.



## ఆర్టీసీ ఉద్యోగులరోడ్డు భద్రతా ర్యాలీ

**తొర్రూరు, ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి)**




ఆర్టీసీ తొర్రూరు డిపో మేనేజర్ పద్మావతి ఆధ్వర్యంలో బుధవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఆర్టీసీ ఉద్యోగులు కార్మికులు రోడ్ భద్రతా ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ తొర్రూర్ డిపో ఉద్యోగులు స్థానిక బస్ డిపో నుండి తొర్రూరు పట్టణంలోని గాంధీ సెంటర్ వరకు ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దాం.. సురక్షితంగా ఇంటికి వెళ్దాం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ వద్ద స్థానిక ఎస్సై ఉపేందర్ మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు పాటిస్తూ డ్రైవర్లు వాహనాలు నడపాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు . డిపో మేనేజర్ పద్మావతి మాట్లాడుతూ ద్విచక్ర వాహనాల పై వెళ్లేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలని ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ, ఎదురుగా వచ్చే వాహనాలను గమనిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో , ఎంఎఫ్ విజయ్ కుమార్, ఎస్టిఐ రజిత రెడ్డి, సూపర్వైజర్లు, డ్రైవర్లు, మెకానిక్ లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మాకుల జాతరలో భక్తుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం

**మరిపెడ,ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి)**



మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో జరుగుతున్న మాకుల జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ శిబిరాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ గుగులోతు రవి పర్యవేక్షణలో నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ గుగులోతు రవి మాట్లాడుతూ.. జాతరకు వేలాదిగా తరలివస్తున్న భక్తులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలుతలెత్తినా, ప్రమాదాలు సంభవించినా తక్షణమే వైద్యసేవలుఅందించేందుకు శిబిరాన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు. భక్తులు అనారోగ్యానికి గురైనప్పుడు ఆలస్యం చేయకుండా శిబిరంలోని వైద్యసదుపాయాలనువినియోగించుకోవాలని సూచించారు.శిబిరంలో డాక్టర్ స్వామి,డాక్టర్ కిరణ్ సాగర్,ఏఎన్ఎంలు నాగమణి,శ్రీదేవి, నర్సుబాయి,ఆశా కార్యకర్తలు పాల్గొని భక్తులకు వైద్య సేవలు అందించారు. అత్యవసర మందులు,ప్రాథమిక చికిత్స పరికరాలు శిబిరంలో అందుబాటులో ఉంచినట్లు ఆరోగ్య సిబ్బంది తెలిపారు.

## అక్రమ ఇసుక డంపు స్వాధీనం



**నర్సింహులపేట,ఏప్రిల్15 (ప్రజాజ్యోతి):** అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంపును బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు తహశీల్దార్ రమేష్ బాబు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండలంలోని వంతడపల గ్రామ శివారులో అక్రమంగా నిల్వచేసిన 16 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసి రెవిన్యూ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్,గ్రామ జీపీవో రాధిక, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

# కేసముద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ ప్రవేశాలు ప్రారంభం

## ఏప్రిల్ 15 నుంచి మే 14 వరకు తొలి విడత ప్రవేశాలు




**కేసముద్రం,ఏప్రిల్ 15(ప్రజాజ్యోతి):** కేసముద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డా. డి. రాజు తెలిపారు. డిగ్రీ ఆన్‌లైన్ సేవలు తెలంగాణ (దోస్త్) ద్వారా ఈ ప్రవేశాలు నిర్వహించబడుతున్నాయని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసి ఉత్తీర్ణులైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన, తమ కళాశాలలో బీఏ (కంప్యూటర్స్, జనరల్), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ (కంప్యూటర్స్), బీఎస్సీ (బీజెడ్‌సీ) వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతి విభాగంలో 60 సీట్లు ఉండగా, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కళాశాల దోస్త్ సంకేత సంఖ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేసముద్రం (2673) ద్వారా తొలి విడతలో ఏప్రిల్ 15 నుంచి మే 14 వరకు ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు సమయానికి దోస్త్ ద్వారా నమోదు చేసుకుని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని కోరారు.

# విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపు

**- చైల్డ్ సేఫ్టీ డే నిర్వహణ**

**- ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు బయగాని రామ్మోహన్**

**మరిపెడ,ఏప్రిల్15 (ప్రజాజ్యోతి)**




మరిపెడ ఉన్నత పాఠశాలలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు బయగాని రామ్మోహన్ ఆధ్వర్యంలో చైల్డ్ సేఫ్టీ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 13 నుంచి 18 వరకు జరుగుతున్న రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.జిల్లా విద్యాశాఖ అధికారి మహబూబాబాద్ ఆదేశాల మేరకు విద్యార్థులకు రహదారి భద్రతపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి, రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. అలాగే వ్యాసరచన,ఉపన్యాసం,క్విజ్, స్కిట్ వంటి పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్ మాట్లాడుతూ..మైనర్ డ్రైవింగ్‌ను అరికట్టడం, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం,కారు ప్రయాణంలో సీట్ బెల్ట్ వినియోగం,రోడ్డు క్రాసింగ్ నిబంధనలు పాటించడం,ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవించడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించామని తెలిపారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్‌కు దూరంగా ఉండాలని, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు,రోడ్ సేఫ్టీ కమిటీల ఏర్పాటు,విద్యార్థులను రోడ్ సేఫ్టీ అంబాసిడర్లుగా తీర్చిదిద్దడం ముఖ్యమని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్ధనాచారి,దేవుల, శ్రీశైలం, నెహ్రూ, ప్రకాష్, శౌరి,రమేష్ రెడ్డి,లెనిన్, ప్రసాదరావు, సారయ్య, జహేదాబేగం,సురేష్,బాబూరావు,రాజకుమారి, సుధా, మంజుశ్రీ, భువనేశ్వరి,శంకర్ తదితరులుపాల్గొన్నారు. విద్యార్థినీ,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# డి.హెచ్.పి.ఎస్ రాష్ట్ర మహాసభలకు వాల్ పోస్టర్ ఆవిష్కరణ




**మరిపెడ,ఏప్రిల్15 (ప్రజాజ్యోతి)** దళిత హక్కుల పోరాట సమితి డి.హెచ్.పి.ఎస్ఆధ్వర్యంలో నిర్వహించబడనున్న తెలంగాణ రాష్ట్ర మహాసభల సందర్భంగా వాల్ పోస్టర్‌ను మరిపెడ పట్టణ కేంద్రంలో కార్గిల్ సెంటర్‌లో ఘనంగా ఆవిష్కరించారు. ఈ మహాసభలు ఈ నెల 17,18 తేదీలలో వరంగల్‌లోని పోచమ్మ మైదానం సమీపంలోని అబ్బాస్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్నాయి.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్, డి.హెచ్.పి.ఎస్ మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దళితులు ఇప్పటికీ అనేక సామాజిక,ఆర్థిక,రాజకీయ అన్యాయాలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.భూహక్కులు, విద్య, ఉపాధి, గృహ వసతి, భద్రత, గౌరవప్రదమైన జీవనం వంటి మౌలిక హక్కులు పూర్తిస్థాయిలో అమలు కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. దళితులపై జరుగుతున్న దాడులు, వివక్ష, అణచివేతలను అరికట్టేందుకు కఠిన చట్టాల అమలు అవసరమని, రాజ్యాంగ హామీలను పూర్తిగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.దళిత యువతను చైతన్యపరచి, సంఘటిత శక్తిగా మారుస్తూ సామాజిక న్యాయం సాధించడమే ఈ రాష్ట్ర మహాసభల ముఖ్య ఉద్దేశ్యమని వెల్లడించారు.ఈ మహాసభలను విజయవంతం చేయడానికి అన్ని వర్గాల ప్రజలు, ముఖ్యంగా దళితులు,యువత, కార్మికులు,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జగన్,గణేష్,రాములు, వెంకటేష్ పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యం

**కేసముద్రం మున్సిపల్**

**వైస్ చైర్ పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు**

**కేసముద్రం, ఏప్రిల్ 15(ప్రజాజ్యోతి):**




కేసముద్రం మండలం మహమూద్ పట్నం గ్రామంలో బుధ వారం ఇండిన్ గోస్పెల్ లీగ్ సంస్థ ఆధ్వ ర్యంలో నిర్వహిం చిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ముఖ్య అతిథి గా కేసముద్రం మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు హాజరైప్రారంభించి,ప్రజలతో మమేకమై వారికి బిపి చెక్ అప్ చేసి, వైద్య రిపోర్టును పరిశీలించి, అవసరమైన మందులను అందజేశారు.ఈ మేరకు సర్పంచ్, ఉప్పుసర్పంచ్ డాక్టర్ అల్లం రమని శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అల్లం రమ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడంలో ఇండిన్ గోస్పెల్ లీగ్ సంస్థ ముందుకు రావడం అభినందనీయమని అన్నారు.గ్రామీణ ప్రాంతాలలో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మహమూద్ పట్నం గ్రామ సర్పంచ్ కట్ల ఎల్లయ్య,ఉపసర్పంచ్ ఏశబోయిన అమృత,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మిట్టగడుపుల యాకుబ్, తౌర్య తండా గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ నాయక్,సంస్థ సభ్యులు పాస్టర్ జెవి రత్నం,పాస్టర్ ఏంజిల్ మూర్తి,సిస్టర్ ఏంజెల్ (కౌసల్య) ,ఆర్.ఎం.పి రామపరపు శ్రీహరి, తదితరులు ఉన్నారు.

# మంత్రి సీతక్కపై విష ప్రచారం చేస్తే ఖబడ్దార్!

**మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ దిష్టిబొమ్మ దహనం**

**అధికారం కోల్పోయిన కసితోనే బీఆర్ఎస్ చిల్లర రాజకీయాలు**

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వజ్జ సారయ్యఢ రూరల్ డెవలప్మెంట్ రాష్ట్ర డైరెక్టర్ చల్ల నారాయణరెడ్డి ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీనివాస్**

**జిల్లా నాయకులు విజయ రూప్సింగ్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకరబోయిన మొగిలి యాదవ్**



**కొత్తగూడ ఏప్రిల్ 15 ప్రజాజ్యోతి** అధికారం పోయిందన్న ఆక్రోశంతో బీఆర్ఎస్ నాయకులు దిగజారుడు రాజకీయాలకు తెరలేపుతున్నారని,ఆదివాసీ అడవి బిడ్డ, మంత్రి సీతక్కపైన సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వజ్జ సారయ్య అన్నారు. బిఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియా వేదికగా మాట్లాడిన తప్పుడు వార్తలను ఖండిస్తూ హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వజ్జ సారయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంత్రి సీతక్కపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ వైఖరిని నిరసిస్తూ కొత్తగూడ మండల కేంద్రంలో బుధవారం రోజున కాంగ్రెస్ పార్టీ మండల నాయకుల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సత్యవతి రాథోడ్ దిష్టిబొమ్మను దహనం చేశారు.అనంతరంఈ సందర్భంగా ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ చల్ల నారాయణరెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ సారయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న తప్పుడు ఆరోపణలు పైన మరియు ఆ పార్టీ నాయకులపై కాంగ్రెస్ పార్టీ నాయకులు నిప్పులు చెరిగారు. గత పదేళ్ల పరిపాలనలో ప్రజలను విస్మరించిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు ఒక నిరుపేద కుటుంబం నుండి వచ్చి అభివృద్ధి పథంలో ప్రజాదరణ పొందుతూ దూసుకు వెళ్తున్న మంత్రి సీతక్కను చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు.బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మంత్రి సీతక్క పైన నిరాధారణమైన ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని మంత్రి సీతక్క పై విషం చిమ్మడం మీ దిగజారుడు తనానికి నిదర్శనం" అని మండిపడ్డారు. అదేవిధంగాబ్లాక్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మొగిలి యాదవ్, మరియు మాజీ ఎంపీపీ, జిల్లా నాయకులు విజయ రూప్ సింగ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ తీరును ఎండగట్టారు ఓటమి భయంతోనే కుట్రలు చేస్తున్నారని క్షేత్రస్థాయిలో సీతక్కకు పెరుగుతున్న ఆదరణను చూసి తట్టుకోలేకనే సత్యవతి రాథోడ్ వంటి వారు సోషల్ మీడియాను అడ్డుపెట్టుకుని అసత్యాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.ఒక మహిళా నాయకురాలై ఉండి, తోటి మహిళా మంత్రిపై తప్పుడు ఆరోపణలు చేయడం సత్యవతి రాథోడ్ సంస్కారానికే విరుద్ధమని ధ్వజమెత్తారు.మంత్రి సీతక్క జోలికి వస్తే తెలంగాణ సమాజం ఊరుకోదని, వెంటనే సత్యవతి రాథోడ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.మా ఆశదీపం సీతక్కపై ఈగ వాలినా ఊరుకోమని..బీఆర్ఎస్ నాయకులు తమ వైఖరి మార్చుకోకపోతే తెలంగాణ వీధుల్లో తిరగనివ్వమని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ చల్ల నారాయణరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీనివాస్ మండలం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుంకర బోయిన మొగిలి యాదవ్ అధికార ప్రతినిధి ఈర్ప రాజేశ్వరరావు, లావణ్య వెంకన్న, రణధీర్, గుమ్మడి సమ్మయ్య, మల్లెల బాబు మరియు అన్ని గ్రామాల సర్పంచులు మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయిలో రాణించిన హాసినికి ఘన సన్మానం

**భూపాల్ నాయక్ టీం సభ్యులు.**

**డోర్నకల్ ఏప్రిల్ 15 ప్రజా జ్యోతి:**
సిరోల్ మండలం ఉప్పరగూడెం గ్రామానికి చెందిన అకోజు శ్రీను, అనిత దంపతుల కూతురు హాసిని రాష్ట్ర స్థాయి పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచి విశేష గుర్తింపు పొందింది. ఖమ్మం ఎస్సార్ కాలేజీలో చదువుతున్న హాసిని ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో రాష్ట్రంలో మొదటి ర్యాంక్ సాధించగా, సెకండ్ ఇయర్‌లో 991 మార్కులతో రాష్ట్రంలో మూడవ స్థానం దక్కించుకుంది. ఈ సందర్భంగా ఉప్పరగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సిరోల్ మండల కోఆర్డినేటర్ డి.ఎస్. రామ్మూర్తి నాయక్ అధ్యక్షత వహించగా, గ్రామ సర్పంచ్ మలికంటి సురేష్ ఆధ్వర్యంలో యువ దళపతి భూపాల్ నాయక్ టీం హాసిని కి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి, మిఠాయిలు తినిపించి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు హాసిని సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని చదువులో



రాణించాలని సూచించారు. భవిష్యత్తులో కూడా ప్రతిభ కనబరిచే ప్రతి విద్యార్థిని ప్రోత్సహించి సన్మానించడం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విష్ణు నాయక్, మరిపెడ ఎడెల్లి వెంకన్న, డోర్నకల్ ఇన్‌చార్జ్ శంకర్ నాయక్, నరసింహులపేట గణేష్, చిన్నగూడూరు శంకర్ నాయక్, ఉప సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## 18వ తేదీన హైదరాబాద్‌లో జరిగే టీయుఎఫ్ సదస్సును విజయవంతం చేయండి

**టీయుఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాయిని శ్రీనివాస్ రెడ్డి**

**బయ్యారం,,ఏప్రిల్ 15ప్రజాజ్యోతి**
తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన హైదరాబాదులో నిర్వహించే సదస్సును విజయవంతం చెయ్యాలని మహబూబాబాద్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ ప్రధానకార్యదర్శి నాయిని శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యమకారుల డిమాండ్లను అమలు చేసుకోవడం కోసం కదిలిరావాలని,ఉద్యమకారులకు కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో లో పెట్టిన 250 గజాల స్థలము,25 వేల రూపాయల పెన్షన్ ఇస్తానని రెండు సంవత్సరాలకు పైగా కావస్తున్న ప్రభుత్వానికి ఎలాంటి స్పందన లేదని,ఈ నెల 18వ తారీకు శనివారం ఉదయం 10 గంటలకు హైదరాబాదు తార్నాకలో మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాలులో జరిగే తెలంగాణ ఉద్యమకారుల



ఫోరం సదస్సు ను విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. ముఖ్యముగా మహబూబాబాద్ జిల్లాలోని ఉద్యమకారులందరూ రాష్ట్ర స్థాయి నుండి మండల స్థాయి గ్రామస్థాయి నాయకులు అత్యధికంగా పాల్గొనాలన్నారు.ఈ మీటింగ్ కు ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు చీమ సీనన్న పాల్గొంటారన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్,ఎమ్మెల్సీ విజయశాంతి, ఉద్యమకారుడు కోదండరామ్, మానకొండూరుఎమ్మెల్యే, డాక్టర్ సత్యనారాయణ, ఇతర నాయకులు ఉద్యమకారులు కళాకారులు మహిళా నాయకురాలు యావత్ తెలంగాణ ఉద్యమకారులం దరూ పాల్గొని ఈ సదస్సును విజయవంతం చెయ్యాలని శ్రీనివాస్ రెడ్డి కోరారు.

# మహిళలకు చేయూత, నిస్తున్న చేతన ఫౌండేషన్

**పోలీసు అధికారుల ప్రశంసలు.. - లబ్ధిదారుల కళ్ళలో ఆనందం..**



**బయ్యారం,,ఏప్రిల్ 15. ప్రజా జ్యోతి**
మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేట పంచాయతీ గంధంపల్లి రైతు వేదికలో చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పేద ప్రజల ఉపాధికి దోహదపడే విధంగా వివిధ ఉపకరణాల పంపిణీ బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పోలీసు అధికారులు చేతన ఫౌండేషన్ సేవలను కొనియాడారు.ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడ్డప్పటికీ స్వగ్రామాన్ని మరవకుండా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న చేతన ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెనిగళ్ళ రవి కుమార్ సేవా భావం ప్రశంసనీయం అని మహబూబాబాద్ డీఎస్పీ నంబూరి తిరుపతిరావు పేర్కొన్నారు.విదేశాల్లో ఉంటూ కూడా స్వదేశ ప్రజల అభ్యున్నతికి కృషి చేయడం గొప్ప విషయం అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులకు 13 తోపుడు బండ్లు,మూడు పిండి మిల్లులు, మూడు ఇస్త్రీ పెట్టెలను ముఖ్య అతిథుల చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఎల్మాస్ మాగ్నెటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తమ సిఎస్ఆర్ సంస్థ నిధులు అందించగా చేతన ఫౌండేషన్ సభ్యులు గ్రామంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఈ పంపిణీ కార్యక్రమం చేపట్టారు.చేతన ఫౌండేషన్ ద్వారా లబ్ధిపొందిన లబ్ధిదారులు చేతన ఫౌండేషన్ వారికీ కృతజ్ఞతలు తెలిపారు.చేతన ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెనిగళ్ళ రవి కుమార్ మార్గదర్శకత్వంలో బంధుమిత్ర బృందం రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం వారి నిస్వార్థ సేవకు నిదర్శనం అని డిఎస్పి తిరుపతి రావు అన్నారు.ఇటువంటి మంచి కార్యక్రమాలకు పోలీసు శాఖ నుండి ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా ప్రవీణ్ కుమార్,సిఐ రవీందర్,ఎస్ఐ తిరుపతి,చేతన ఫౌండేషన్ కెనడా ప్రతినిధి సీతారామారావు,సంస్థ అధ్యక్షుడు వెనిగళ్ళ అనిల్ కుమార్,ఉపాధ్యక్షుడు వెనిగళ్ళ వెంకటేశ్వరరావు,జాయింట్ సెక్రటరీ దొడ్డా సీతారామయ్య, సభ్యులు తాతా గణేష్,నవీన్,రషీద్, తోటకూర అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.




## మాకులలో వైభవంగా శ్రీవేంకటేశ్వర స్వామి పారువేట ఉత్సవం



**మరిపెడ,ఏప్రిల్15(ప్రజాజ్యోతి)**
మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని మాకుల గ్రామంలో ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో లోక కల్యాణార్థం నిర్వహించిన పారువేట ఉత్సవం ఘనంగా,భక్తిశ్రద్ధల మధ్య జరిగింది.ఈ సందర్భంగా స్వామివారు అశ్వవాహనంపై ఆలయం నుండి పారువేట కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.ఉత్సవం సందర్భంగా ఆలయంలో వేదపండితులు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించగా,గ్రామం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది.ఈ సందర్భంగా రైతులు, భక్తులు తమ ఎడ్లబండ్లను అందంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ పారువేట ఉత్సవాన్ని తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఉత్సవం సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతోకిటకిటలాడాయి.ఈకార్యక్రమం ప్రశాంతంగా జరిగేందుకు గ్రామ పెద్దలు, యువకులు,ఆలయ కమిటీ సభ్యులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

## సీసీ కెమెరా పర్యవేక్షణలో బయ్యారం పెద్ద చెరువు

**బయ్యారం,,ఏప్రిల్ 15. ప్రజాజ్యోతి**



మహబూబాబాద్ జిల్లా బయ్యారం పెద్ద చెరువు వద్ద రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు అనధికారంగా తూములను లేపి నీటిని వృధా చేయడం గత మూడు రోజులుగా జరుతున్నట్లు సమాచారం. ఇలా తూములను లేపడం వల్ల పంట పొలాలకు అందాల్సిన నీరు వృధా అవ్వడం జరుగుతుంది.ఇలాంటి చర్యల వల్ల యాసంగీ పంటకు అనుమతించబడిన రైతులకు పంటలకు తగిన నీరు అందకుండా ఇబ్బందులు కలగవచ్చని గమనించిన నీటిపారుదల శాఖ అధికారులు ఈ సమస్యను నివారించుటకు చెరువు భద్రతను మెరుగుపరుచుటకు చెరువు తూము సమీపంలో సీసీ కెమరాలను ఏర్పాటు చేసినట్లు నీటి పారుదల శాఖ డిఈఈ నాగార్జున సాగర్ బుధవారం తెలిపారు.ం

## కలెక్టర్‌ను కలిసిన ఇల్లందు ఎమ్మెల్యే, కోరం కనకయ్య

**బయ్యారం ఏప్రిల్ 15 ప్రజాజ్యోతి**



మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ని వారి కార్యాలయంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య బుధవారం మర్యాద పూర్వ కంగా కలిశారు.ఈ సందర్భంగా కలెక్టర్ తో మాట్లాడుతూ గార్ల బయ్యారం మండలాలకు సంబంధించిన అనేక అభివృద్ధి పనులకు,పెండింగ్ వర్క్ లకు సంబందించిన అంశాలపై మాట్లాడినట్లు తెలిపారు.రబిలో పండించిన మొక్కజొన్న రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని, సంబంధిత అధికారులు ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్ ని ఎమ్మెల్యే కనకయ్య కోరారు.ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి,కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ తదితరులు ఉన్నారు.